TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 147 | గురువారం 21-05-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-



విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...


## కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత




- సీజేపీ ఎక్స్ ఖాతా భారత్‌లో నిలిపివేత
- వారం రోజుల్లోనే 2 లక్షల ఫాలోవర్లు
- ఇన్‌స్టాలో 14 మిలియన్లకు పైగా ఫాలోవర్స్
- బోస్టన్ యూనివర్సిటీ విద్యార్థి అభిజిత్ దీప్కే ప్రారంభం
- సీజేఐ వ్యాఖ్యల నేపథ్యంలో సటైరికల్ క్యాంపెయిన్
- సీజేపీ వెబ్‌సైట్ కూడా ప్రారంభం

2లో

## రన్‌వేను తాకిన విమానం తోక భాగం..

### తప్పిన ప్రమాదం




- బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా విమానానికి ప్రమాదం తప్పింది
- ల్యాండింగ్ సమయంలో రన్‌వేను తాకిన విమానం తోక భాగం
- విమానంలో 186 మంది ప్రయాణికులు
- సురక్షితంగా ల్యాండ్ కావడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు
- తనిఖీల కోసం విమానాన్ని నిలిపివేసిన అధికారులు
- ఢిల్లీకి తిరుగు ప్రయాణం రద్దు

2లో

## వేంకటేశ్వరుని కిరీటం ఎక్కడ?.. తాకట్టు వ్యవహారంపై విచారణ



ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్న దేవాదాయశాఖ ఏసీ లలిత

గుడివాడ: కృష్ణా జిల్లా గుడివాడలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు సమర్పించిన వజ్రసహిత సువర్ణ కిరీటం మాయంపై దేవాదాయశాఖ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ అధికారులు స్పందించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత ఆలయానికి చేరుకుని అర్చకుడి నుంచి వివరాలు సేకరించారు. దేవస్థానం ట్రస్ట్ కార్యాలయం తాళాలు, రికార్డులు అడిగారు. ట్రస్ట్‌లోని 31 మంది సభ్యులు అందుబాటులో లేమని ఫోన్‌లో సమాధానం ఇవ్వడంతో ఏసీ విస్మయం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేజి 2లో ▶



## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

### కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు



సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ.


## తెలంగాణ రక్షణ సేనపై అభ్యంతరాలకు జూన్ 1వరకు గడువు




- తెలంగాణ రక్షణ సేన పార్టీపై అభ్యంతరాలకు ఈసీ అవకాశం
- జూన్ 1లోపు అభ్యంతరాలు పంపాలని సూచన
- కొత్త పార్టీ ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత
- పార్టీ వివరాలతో పత్రికల్లో బహిరంగ ప్రకటన
- బంజారాహిల్స్ చిరునామాగా నమోదు
- ఈసీ నిబంధనల ప్రకారం ప్రక్రియ కొనసాగింపు
- అభ్యంతరాలను ఈసీ కార్యదర్శికి పంపాలన్న సూచన

2లో

## బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి



2లో

## ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి




- విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి
- 8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ తర్ఫీదు
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలకు అభినందనలు
- ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రిన్సిపాల్ లకు హెచ్చరిక

2లో

## నిప్పుల కుంపటిగా తెలుగు రాష్ట్రాలు..

### పిడుగురాళ్లలో 48 డిగ్రీలు



ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. జిల్లాల వారీగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు కింది పట్టికలో..

## హైదరాబాద్‌లో కొన్ని చోట్ల విద్యుత్ వైర్లు మార్చాలి: వీహెచ్



హైదరాబాద్: నగరంలో పలుచోట్ల విద్యుత్ వైర్లను మార్చాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు (వీహెచ్) కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. "పలు ప్రాంతాల్లో నిజాం కాలంలో వేసిన విద్యుత్ వైర్లు ఇప్పటికీ ఉన్నాయి. పాత వైర్ల వల్ల కొన్నిచోట్ల షార్ట్ సర్క్యూట్ జరుగుతోంది. ఇన్సూరెన్స్ లేని వాళ్లకు చాలా నష్టం కలుగుతోంది. కొత్త వైర్లు వేయాలని వ్యాపారులు కోరుతున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గి ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించవచ్చు. కొత్త వైర్లు వేసేలా భట్టి విక్రమార్క చర్యలు తీసుకోవాలి"అని కోరారు.

## విశాఖలో 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం: ఎంపీ శ్రీభరత్



దిల్లీ: విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపీ శ్రీభరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జీవీఎంసీ ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్టు చెప్పారు. రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మధురవాడ జోన్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ.725.18 కోట్లు, బల్క్ అండ్ సెమీ బల్క్ నీటిసరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయన్నారు.

# సంపాదకీయం

## ఆ జ్ఞాననిధులను విస్మరిస్తే వినాశనమే!

'ఉత్తమ భావాలు అన్ని వైపుల నుంచి రావాలి' అని విశ్వసించిన మన పూర్వీకులు అభివృద్ధిపరిచిన జ్ఞాన వ్యవస్థలను గుడ్డిగా ఆరాధించడమో లేదా పూర్తిగా తిరస్కరించడమో జరుగుతోంది. ఇవి ఆలోచనారహిత వైఖరులు. భారతీయ జ్ఞాన వ్యవస్థల పట్ల అటువంటి ప్రతిస్పందనలు వివేకవంతమైనవి కావని ఇటీవలి రెండు నూతన పుస్తకాలు సూచించాయి. పురాతన భారతీయుల శాస్త్రీయ విజ్ఞానాన్ని, తాత్విక భావప్రవంతిని అల్లా టప్పా గా భావించకుండా గంభీరమైన మేధో నిబద్ధతతో మనం వాటిని శోధించి తీరాలని కూడా ఆ పుస్తకాలు నొక్కి చెప్పాయి. ఈ మేధా కర్తవ్యాన్ని ఎలా చేయాలో, ఎలా చేయకూడదో కూడా అవి నిర్దేశించాయి.

భారతీయ ఉన్నత విద్యా జగత్తులో ఇప్పుడు విస్తృతంగా చర్చిస్తున్న విషయం భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్-- ఐకేఎస్). ప్రతి విశ్వవిద్యాలయమూ ఐకేఎస్ సంబంధిత సదస్సును నిర్వహించి దాని వివరాలను సచిత్రంగా, సవివరంగా తమ వెబ్‌సైట్‌పై ఉంచుతున్నది. విద్యావేత్తలూ పురాతన భారతీయ జ్ఞాన సంచయంలో ఒక వినూత్న సత్యాన్ని ఆవిష్కరించేందుకు ఆరాటపడుతున్నారు. తమ పరిశోధనా కృషి, ఐకేఎస్ మధ్య ఉన్న సంబంధాన్ని సగర్వంగా చెప్పుకుంటున్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలపై ఉన్నత విద్యా ప్రపంచంలో వెల్లివిరుస్తున్న ఈ అభిమానం సహజమైనదేనా? మేధో అంతః ప్రేరణల జనితమేనా? కాదు, కానే కాదు. ప్రభుత్వం పురికొల్పిన విద్యాసక్తి అది. పురాతన భారతీయుల జ్ఞానాన్ని ఆధునిక పాఠ్యాంశాలలో భాగంగా చేసేందుకై భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధన, బోధనను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

ప్రభుత్వం పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్న భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనా కార్యకలాపాల ప్రహసనంపై తీవ్ర విమర్శనాత్మక ప్రతిస్పందనలు అనివార్యంగా వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రజల్లో 'వైజ్ఞానిక దృక్పథం'ను పెంపొందించాలని అభిలషిస్తున్నవారు పురాతన భారతీయ జ్ఞానం అశాస్త్రీయమైనదని, అర్థరహితమైనదని కొట్టివేస్తున్నారు. జ్ఞాన సంప్రదాయాలకు ప్రభుత్వం అంత ప్రాధాన్యమివ్వడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు బ్రాహ్మణీయ ప్రపంచ దృక్పథాన్ని సమస్త భారతీయులపై రుద్దే ప్రయత్నమే ఐకేఎస్‌ను ప్రోత్సహించడమని నిరసిస్తున్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నవారు నిరంకుశ పాలనా ధోరణులపై నిరసన ప్రబలకుండా అదుపు చేసేందుకే ఐకేఎస్ పేరిట మిథ్యా జాతీయ స్వాభిమానాన్ని పెంపొందిస్తున్నారని దుయ్యబడుతున్నారు. ఐకేఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం ఎంత ఎక్కువగా వాదిస్తే ప్రగతిశీల, ఉదారవాద విద్యావంతులు అంత ఎక్కువగా భారతీయ జ్ఞాన వ్యవస్థ అనే భావనను పరిహసిస్తున్నారు. ప్రభుత్వ వాదన ఎలా ఉన్నప్పటికీ ఐకేఎస్‌ను ఈ విధంగా అపహసించడం, తిరస్కరించడం తీవ్ర మేధాపరమైన, రాజకీయ తప్పిదమే అవుతుంది, సందేహం లేదు.

సరే, ఆధునిక మానవ జ్ఞానచరిత్ర తన స్వీయ చరిత్రే అని పాశ్చాత్య ప్రపంచం భావిస్తోంది. మానజ్ఞానానికి ఏకైక భండారం తమ మేధ అని పాశ్చాత్య దేశాలు మిడిసిపడుతున్నాయి. అహంకరిస్తున్నాయి. ఇది పూర్తిగా చారిత్రక అసంబద్ధం. ప్రాచ్య ప్రపంచం ముఖ్యంగా భారతదేశం ఆ అసంగతాన్ని ఎలా విశ్వసిస్తుంది? సహిస్తుంది? తాము పుట్టి పెరిగిన మాతృభూమి జ్ఞాన వనరులు, మేధో సంప్రదాయాలపై రేపటి తరాలకు అవగాహన లేకుండా చేయడం సాంస్కృతిక వినాశనానికి దారితీస్తుంది. వేల సంవత్సరాల భారతీయ సాంస్కృతిక, నాగరికతా వారసత్వాన్ని మరచిపోవడం లేదా వాటికి దూరమవడం నిస్సందేహంగా రాజకీయ తప్పిదం అవుతుంది. వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న నాటి నుంచి మన మేధా సంప్రదాయాలను ఉపేక్షించామన్న గర్హనీయ వాస్తవాన్ని అంగీకరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థలతో మన బాంధవ్యాన్ని అధునాతనం చేసుకోవడం ప్రారంభమవ్వాలి. భావాలలో స్వరాజ్య సాధనకు సంబంధించిన అజెండాలో భారతీయ జ్ఞానవనరుల పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంతర్భాగమవ్వాలి. మేధోపరమైన, సాంస్కృతిక స్వీయ నిర్ణయాధికారమే నిజమైన స్వాతంత్ర్యం అనేది మనం విస్మరించకూడదు.

ఐకేఎస్‌తో సమస్య దాని మౌలిక భావన కాదు, దాని రూపకల్పనే అని చెప్పక తప్పదు భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనకు ప్రభుత్వం నిర్దేశించిన విధానం భావనాత్మకంగా లోపభూయిష్టమైనది. దానికి సమగ్ర దృక్పథం కొరవడింది. పైగా పలు కుదింపులతో దాని పరిధి సంకుచితమయింది. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ప్రాచీనకాలపు అవశేషాలుగా పరిగణించడం మొట్టమొదటి పెద్ద కుదింపు. సజీవ, చైతన్యశీల భారతీయ జ్ఞాన సంప్రదాయాలు పురాతన యుగాలలో మాత్రమే వర్ధిల్లాయా? సుదూర గతంపైన మాత్రమే దృష్టి సారించడం రెండో కుదింపు. ముస్లిం, బ్రిటిష్ పాలనా యుగాలలో సమున్నతంగా జరిగిన మేధో కృషిని ఐకేఎస్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. జ్ఞాన వ్యవస్థలను కేవలం రాతపూర్వక గ్రంథాలకే పరిమితం చేయడం మూడో కుదింపు. వ్యవసాయం, నేత కార్మికులు, చేతి వృత్తుల వారి దైనందిన కార్యకలాపాలలో నిక్షిప్తమై ఉన్న ఆచరణాత్మక, నిగూఢ జ్ఞానాన్ని విస్మరించడం సమంజసం కాదు. గ్రామీణ సమాజాలలో నేటికీ ఆ జ్ఞాన సంప్రదాయాలు ప్రయోజనకరంగా వర్ధిల్లుతూనే ఉన్నాయి. వాటిని ఉపేక్షిస్తే నష్టం వాటిల్లేది ఎవరికి? ఐకేఎస్ పరిగణనలోకి తీసుకుంటున్న పురాతన గ్రంథాలు పూర్తిగా బ్రాహ్మణీయ మేధో సంప్రదాయానికి చెందినవే కావడం నాలుగో కుదింపు. ప్రాంతీయ, దేశీ సంప్రదాయాలను శోధించక పోవడం సరికాదు. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక పాశ్చాత్య ప్రమాణాలు, దృక్కోణాల పరంగా మూల్యాంకనం చేయడం ఒక పెద్ద పొరపాటు. ఇది సత్యావిష్కరణకు ఎలా దోహదం చేస్తుంది?

సరే, ఇప్పుడు నేను తొలుత ప్రస్తావించిన రెండు కొత్త పుస్తకాల గురించి వివరంగా నివేదిస్తాను. వాటిలో మొదటిది 2025లో ప్రచురితమైన 'భారత్ కి సారస్వత్ సాధన'. భారతీయ మేధో సంప్రదాయాలతో మనం మమేకమయ్యే మార్గాన్ని ఇది నిర్దేశించింది. రచయిత రాధా వల్లభ్ త్రిపాఠి మన కాలపు ప్రముఖ సంస్కృత విద్వజ్ఞుడు. సంస్కృత భాషలోని వందకు పైగా సాహిత్య, తాత్విక ఉద్గ్రంథాలకు అనువాదాలు చేశారు, విపుల వ్యాఖ్యానాలు వెలయించారు. క్రీస్తుపూర్వం 1000 సంవత్సరం నుంచి క్రీ.శ. 20వ శతాబ్ది దాకా 19 మంది మహాకవులు, మహాదార్శనికుల మేధో కృషి గురించి విపులంగా వివరించిన పుస్తకమే 'భారత్ కి సారస్వత్ సాధన'. భారతదేశంలో జ్ఞానం, సాహిత్య సృష్టి ఎలా సాగిందో త్రిపాఠి నేటి పాఠకులకు సుబోధకం చేశారు. సమాజానికి మేధస్సును, నైతికతను అందించిన మహాకవులు, దార్శనికుల రచనల పాధాన్యాన్ని, వర్తమాన ప్రాసంగికతను వివరించారు. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందికరమైన సత్యాలను కప్పిపుచ్చేందుకు ఆయన ప్రయత్నించలేదు. ఇది గమనార్హం, ప్రశంసనీయం. పాశ్చాత్య సంస్కృత విద్వాంసులను గౌరవిస్తూనే వారి మేధా కృషిని నిశితంగా పరిశీలించారు. తన అభిప్రాయాలను నిష్కర్షగా తెలిపారు. భారతీయ జ్ఞానసంప్రదాయాల పట్ల తన ప్రగాఢ అభిమానాన్ని వ్యక్తం చేస్తూనే ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఐకేఎస్ ప్రాజెక్టులో భాగమయ్యేందుకు ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.

రెండో పుస్తకం 'అల్లమ ప్రభు అండ్ శైవ ఇమాజినేషన్'. ఇది కూడా 2025లోనే ప్రచురితమైనది. భారతీయ మేధా చరిత్రలో మరొక ముఖ్యభాగమైన బ్రాహ్మణేతర, సంస్కృత భాషాయేతర సంప్రదాయాలపై ఈ పుస్తకం దృష్టి నిలిపింది. రచయిత డీఆర్ నాగరాజ్ కన్నడ మేధావి. స్వతంత్ర భారతదేశంలో సమగ్ర సాంస్కృతిక విమర్శకులలో ఆయన అగ్రగణ్యుడు. నాగరాజ్ కన్నడంలో రాసిన ఆ పుస్తకం ఆయన మరణానంతరం 1999లో ప్రచురితమయింది. రెండున్నర దశాబ్దాల అనంతరం ఆ కన్నడ పుస్తకానికి ఎన్ఎస్ గండూర్ ఆంగ్లానువాదం వెలువడింది. 12వ శతాబ్ది వీరశైవ ఉద్యమంలో ప్రముఖ వచనకారుడు అయిన అల్లమ ప్రభు గురించిన పుస్తకమిది. కవిగా, తాత్వికుడుగా అల్లమ ప్రభు విశిష్టతను వివరించడంలో భారతీయ సాహిత్య తత్వశాస్త్ర చరిత్ర రచనా రీతులు అట్టడుగు వర్గాల వారి ఆలోచనా శైలులను విస్మరించడాన్ని నాగరాజ్ విమర్శించారు. భావ చిత్రాలు, రూపకాలంకారాలతో అల్లమ ప్రభు మొదలైన అణగారిన వర్గాల విద్వజ్ఞుల విశిష్ట దేశీయ కల్పనా ప్రతిభను సంప్రదాయ పండితులు గుర్తించలేదని నాగరాజ్ నిక్కచ్చిగా చెప్పారు. పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాన్ని కాకుండా కశ్మీర్ తాత్వికుడు అభినవగుప్త శైవ మీమాంస సంప్రదాయాల ఆధారంగా అల్లమ ప్రభు వచనాలను నాగరాజ్ పరిశీలించి వాటికి వినూత్న భాష్యాలు చెప్పారు.

# ఎంజేపి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

మొదటిపేజీ తరువాయి

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయుల తోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 026-27 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్థవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అ÷-దదె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు.టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టి గా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి..పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో

సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు.జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు.

అధ్యాపకులంతాఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు.పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు.500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు.65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు.35 విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌళిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు.

# పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్ట్

**ఇన్ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి**

**డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై చైతన్యం కల్పించాలి**

**త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం**

**ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు**

**'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి జూపల్లి కృష్ణారావు**

:'పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకే పరిమితం కాదు.. అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనం' అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా బేగంపేట టూరిజం ఎ÷-లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చిన సలహాలు సూచనలు స్వీకరించి పర్యాటక రంగాన్ని మరింత మెరుగు పరుస్తామని చెప్తుతునే.. పర్యాటక ప్రమోషన్ తో పాటు ప్రజల్లో ముఖ్యంగా యువతలో సామాజిక స్పృహ కలిగించడానికి కృషి చేయాలని దిశానిర్దేశర చేశారు. పర్యాటక ప్రాంతాల ప్రోత్సాహంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. 'మన ప్రాంతాలను మనమే చూడకపోతే జీవితం సంపూర్ణం కాదు' అని పేర్కొన్న ఆయన.. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఆర్థిక స్థోమత అడ్డంకి కాదన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం వల్ల మానసిక ప్రశాంతత, ఆనందం లభిస్తాయని సూచించారు. దేశ, విదేశీ పర్యాటకులతో పాటు స్వరాష్ట్ర ప్రజలు కూడా తెలంగాణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ వసతి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని తెలిపారు. వినియోగంలో లేని హరిత మోటళ్లు, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. యువత.. గంజాయికి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటితో మానసిక రుగ్మతకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు ఇన్లు యెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రభాత భేరి అనే సరికొత్త సామాజిక చైతన్య కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతుందని, లఘు చిత్రాలు, నాటికలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యచరణను అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

తెలంగాణ సంస్కృతి, వారసత్వం, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రియేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే కంటెంట్ క్రియేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరఫున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు.

# కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత

మొదటిపేజీ తరువాయి

సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఎక్స్ ఖాతాను భారత్‌లో నిలిపివేశారు. అనధికారిక పొలిటికల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించిన వారం రోజుల్లోనే తమ 'ఎక్స్' ఖాతాను నిలిపివేశారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తెలిపారు. ఎక్స్ ఖాతా నిలిపివేసే సమయానికి ఆ ఖాతాకు దాదాపు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. మరోవైపు, కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే సీజేపీకి చెందిన ఇన్‌స్టా ఖాతాను 14 మిలియన్ల మందికి పైగా ఫాలో అవుతుండటం గమనార్హం. సీజేపీ పేరిట వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. కొంత మందిని బొద్దింకలతో పోల్చుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలోనే సటైరికల్‌గా కాక్రోచ్ జనతా పార్టీ అనే వేదిక పుట్టుకొచ్చింది. ఈ ఆన్‌లైన్ ప్రచార కార్యక్రమాన్ని అభిజీత్ దీప్కే అనే యువకుడు ప్రారంభించారు. అమెరికాలో బోస్టన్ యూనివర్సిటీలో ఇటీవలే పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. ఈ పార్టీలో చేరేందుకు కావాల్సిన అర్హతలు, మ్యానిఫెస్టో, విజన్‌ను తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అయితే తన వ్యాఖ్యలను మీడియాలోని కొన్ని వర్గాలు వక్రీకరించాయంటూ సీజేఐ వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.

**కాక్రోచ్ ఈజ్ బ్యాక్..**

కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను నిలిపివేసిన వెంటనే ఆ డిజిటల్ అవుట్‌ఫిట్ మరో కొత్త ఖాతాను క్రియేట్ చేసింది. "నిన్న మా ఎక్స్ ఖాతాను హ్యాక్ చేసే ప్రయత్నాలు జరిగాయి. దాంతో ఇలాంటిది ఏదో ఉంటుందని ఊహించాం. ఇప్పుడు మేం 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అనే ఎక్స్ ఖాతాను ప్రారంభించాం. ప్రస్తుత పరిణామాలను న్యాయపరంగా పరిష్కరించుకుంటాం" అని సీజేపీ అభిజీత్ వెల్లడించారు. ఈ ఖాతాను క్రియేట్ చేసిన గంటలోపే 16వేలమందికిపైగా ఫాలో అవుతున్నారు.

# రన్‌వేను తాకిన విమానం తోక భాగం..

మొదటిపేజీ తరువాయి

ఎయిరిండియా విమానానికి ప్రమాదం తప్పింది. దిల్లీ నుంచి వచ్చిన విమానం బెంగళూరు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా దాని తోక భాగం రన్‌వేను తాకింది. అయితే, సురక్షితంగా ల్యాండ్ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో విమానంలో 186 మంది ఉన్నారు. ఈ ఘటన నేపథ్యంలో విమానాన్ని తనిఖీల నిమిత్తం నిలిపివేశారని అధికారులు తెలిపారు. ఈ కారణంగా దిల్లీకి ఆ విమాన తిరుగు ప్రయాణం రద్దయిందని చెప్పారు.ఎయిరిండియా విమానయాన సంస్థ ఈ ఘటనను ధ్రువీకరించింది. దీనిపై దర్యాప్తు నిర్వహిస్తామని తెలిపింది. ఈ ఘటనతో ప్రభావితమైన ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించింది. బెంగళూరులోని తమ బృందాలు అవసరమైన సాయాన్ని అందిస్తున్నాయని పేర్కొంది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని.. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే అత్యంత ప్రాధాన్య అంశమని తెలిపింది.

**కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత**

"ఎయిరిండియా విమానం ల్యాండింగ్‌కు సమీపిస్తున్న సమయంలో.. అప్పుడే ఓ బోయింగ్ 747 విమానం టేకాఫ్ తీసుకుంది. ఆ బోయింగ్ విమానం ఇంజిన్ల ధాటికి అక్కడ విండ్ టర్బులెన్స్ ఏర్పడింది. దీంతో విమానం ల్యాండింగ్ విషయంలో సమస్య ఉత్పన్నమైంది" అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# వేంకటేశ్వరుని కిరీటం ఎక్కడ?.. తాకట్టు వ్యవహారంపై విచారణ

మొదటిపేజీ తరువాయి

దాత కుటుంబ సభ్యులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ఇవాళ మధ్యాహ్నంలోపు విచారణ నివేదిక అందించాల్సి ఉండటంతో .. అసిస్టెంట్ కమిషనర్ లలిత దేవస్థానంలోనే వేచి ఉన్నారు. ఆలయ కమిటీ.. దేవాదాయ శాఖ పరిధిలో లేకపోవడంతో ట్రస్టు బోర్డుపై చర్యలు తీసుకోలేకపోతున్నామని ఏసీ తెలిపారు. ఈ వ్యవహారం ముదరడంతో బంగారం తాకట్టు వ్యాపారి పరారీలో ఉన్నాడు. తన ఖాతాలోకి తాకట్టు డబ్బులు పంపితేనే.. ఊర్లోకి వస్తానంటూ మధ్యవర్తుల ద్వారా ట్రస్టుబోర్డుకి సమాచారం అందించారు.

**కిరీటం మాయం.. వెలుగులోకి ఇలా..**

గుడివాడలోని ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చెందిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి 2025 జనవరిలో మాటూరి సుబ్బారావు రూ.70లక్షల విలువైన వజ్రాలు పొదిగిన 461 గ్రాముల బంగారు కిరీటాన్ని బహూకరించారు. సుబ్బారావు ఇటీవల ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోగా కిరీటం కనిపించలేదు. ఆలయ కమిటీ నేతల్ని అడిగితే బ్యాంకు లాకరులో ఉందని చెప్పారు. మరోసారి ఆలయానికి వెళ్లి.. 'ఓసారి కిరీటాన్ని అలంకరించండి. 81 ఏళ్ల వయసు గలవాడిని, కిరీటంతో స్వామిని చూడాలని ఆశగా ఉంది' అని కోరితే.. మళ్లీ వేరే బ్యాంకు లాకరులో ఉందన్నారు. దీంతో సుబ్బారావు ఆరా తీయగా.. కల్యాణ మండపం ఆధునికీకరణకు కిరీటాన్ని కుదువ పెట్టినట్లు తెలిసి హతాశుడయ్యారు.

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతించింది. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈనెల 15న వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు ఆయన తరఫున న్యాయవాది అనుమతి కోరారు. న్యాయవాది విజ్ఞప్తి మేరకు హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది.

# తెలంగాణ రక్షణ సేనపై

## అభ్యంతరాలకు జూన్ 1వరకు గడువు

మొదటిపేజీ తరువాయి

కల్వకుంట్ల కవిత నూతనంగా ఏర్పాటుచేసిన తెలంగాణ రక్షణ సేనపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే జూన్ 1వ తేదీలోపు చెప్పుకోవచ్చని కేంద్ర ఎన్నికలసంఘం పేర్కొంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కొత్త పార్టీ ఏర్పాటు గురించి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మే 1వ తేదీన ది ఎకో ఆఫ్ ఇండియా పత్రికలో ఇంగ్లిష్‌లో, మే 3న ఆజ్ అన్న హిందీపత్రికలో బహిరంగ ప్రకటన ఇచ్చారు. అందులో పార్టీ చిరునామా, ప్రెసిడెంట్ (కల్వకుంట్లకవిత) వైస్‌ప్రెసిడెంట్ (రూప్‌సింగ్ లఖావత్), జనరల్ సెక్రెటరీ (దేవనపల్లి రామయగారి అనిల్‌కుమార్), ట్రెజరర్ (అరుణ్‌కుమార్), జాయింట్ ట్రెజరర్ (పొనుగోటి పవన్‌కుమార్)ల పేర్లు ఇచ్చారు. బంజారాహిల్స్ రోడ్డు నెం.14, సర్వే నెంబర్ 129/54లోని 8-2-316/హెచ్ ఇంటినెంబర్‌ను చిరునామాగా పేర్కొన్నారు. ఈ పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలుంటే కారణాలతో సహా కేంద్ర ఎన్నికలసంఘం కార్యదర్శి (రాజకీయపార్టీల వ్యవహారాలు)కి 30రోజుల్లోపు పంపాలని ఈ ప్రకటనలో పిలుపునిచ్చారు. దీని ప్రకారం జూన్ 1వరకు అభ్యంతరాలు పంపుకోవడానికి వీలున్నట్లు కేంద్ర ఎన్నికలసంఘం తెలిపింది.

# వేములవాడలో అక్రమ మట్టి రవాణాలో జేసీబీ, రెండు ట్రాక్టర్ల సీజ్

వేములవాడ/ ప్రజాదివాస్ మే 21

వేములవాడ అర్బన్ మండలం పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వేములవాడ టౌన్ పోలీసులు నిన్న తెల్లవారుజామున జరిపిన మెరుపు దాడుల్లో భారీగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిన్న తెల్లవారుజామున సుమారు 5:00 గంటల ప్రాంతంలో టౌన్ పోలీస్ సిబ్బంది వేములవాడ అర్బన్ మండలంలోని చంద్రగిరి గ్రామ పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ సహాయంతో చట్టవిరుద్ధంగా మట్టిని లోడ్ చేస్తుండటాన్ని పోలీసులు గమనించారు. అనుమానం వచ్చిన పోలీసులు సదరు వాహనాలను నిలిపివేసి, మట్టి తవ్వకాలకు మరియు రవాణాకు సంబంధించిన



అనుమతి పత్రాలను చూపించాల్సిందిగా కోరారు. అయితే, అక్కడున్న వ్యక్తులు ఎలాంటి చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ అనుమతి పత్రాలను చూపించలేకపోయారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు మధ్యవర్తుల సమక్షంలో వారిని నిలదీయగా.. తాము అక్రమంగా మట్టిని తవ్వి, ట్రాక్టర్ల ద్వారా తరలించి, విక్రయించడం ద్వారా అక్రమంగా లాభాలు పొందుతున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. ఈ వ్యవహారంలో అక్రమ రవాణాకు పాల్పడుతున్న 3 మంది డ్రైవర్లు మరియు 3 మంది వాహన యజమానులను పోలీసులు గుర్తించారు. వీరందరిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో పట్టుబడిన ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుక తవ్వకాలు జరిపినా లేదా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రజలు కూడా ఇలాంటి విషయాలపై సమాచారం అందించాలని వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ స్పష్టం చేశారు.

# కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల సమీపంలోనే అక్రమ దాబా..?

- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల పక్కనే నిబంధనలకు విరుద్ధంగా దాబా ఎలా కొనసాగుతోంది..?
- ఎక్సైజ్ అధికారులు ఎప్పుడైనా తనిఖీలు నిర్వహించారా..?
- మున్సిపల్ అనుమతులు పూర్తి స్థాయిలో ఉన్నాయా..?
- పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు ఎందుకు కనిపించడం లేదు..?
- ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖలు ఎందుకు మౌనం పాటిస్తున్నాయి..?
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి..?

రాజన్న సిరిసిల్ల జిల్లా మే 21 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనే అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. జిల్లా కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాలకు అతి సమీపంలో ఓ దాబా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలోనే ఈ వ్యవహారం నడుస్తుండటంతో అధికార యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, సంబంధిత దాబాలో రాత్రి వేళల్లో అనుమతులకు విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుడ్ వ్యాపారం పేరుతో సిట్టింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి, బయట నుంచి మద్యం తీసుకువచ్చి వినియోగించే పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ కార్యకలాపాలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# నంది కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

- అర్బన్ మండల అధ్యక్షుడు వంగ పర్శరాము గౌడ్ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకల కార్యక్రమం

వేములవాడ/ప్రజాదివాస్ మే 21

ఐటీ విప్లవం, 18 ఏళ్లకే ఓటు హక్కు రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనం: వంగ పర్శరాము గౌడ్, పిల్లి కనకయ్య భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వేములవాడ అర్బన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంగ పర్శరాము గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక నంది కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వంగ పర్శరాము గౌడ్ మాట్లాడుతూ.. దేశ సాంకేతిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి



ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతి కోసం ఆయన చేసిన త్యాగాలు వృథా పోనివ్వబోమని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పిల్లి కనకయ్య మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించడంలో రాజీవ్ గాంధీ పోషించిన పాత్ర చారిత్రాత్మకమైనదన్నారు. భారతదేశంలో నేడు మనం చూస్తున్న సమాచార సాంకేతిక (ఐటి) రంగ వృద్ధికి, టెలికాం విప్లవానికి రాజీవ్ గాంధీ అప్పట్లోనే పునాది వేశారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి దేశ రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేశారు. అధికార వికేంద్రీకరణ ద్వారా గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత వసతితో కూడిన విద్యను అందించడం కోసం దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని నాయకులు కొనియాడారు. దేశంలో అంతర్గత భద్రత, శాంతిని పెంపొందించడానికి అస్సాం, మిజోరాం, పంజాబ్ ప్రాంతాలలో చారిత్రాత్మక శాంతి ఒప్పందాలను కుదుర్చుకున్నారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించారు.

# మండల అంగన్వాడి ఉపాధ్యాయులతో ఎంఈఓ సమావేశం

ముస్తాబాద్/మే 21 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాదు మండలంలోని , గ్రామంలోని అంగన్వాడి ఉపాధ్యాయులతో మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి అధ్యక్షతన బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదు అనే ఉద్దేశ్యంతో ముందస్తుగా సమావేశం నిర్వహించడం జరిగింది ఇట్టి సమావేశంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు అంగన్వాడీలో ఉండాలని అలాగే ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు బడి బయట పిల్లలు ఎవరు కూడా జూన్ తర్వాత ఉండకూడదని సూచించారు ఇట్టి కార్యక్రమంలో పలు అంగన్వాడి స్కూల్ ఉపాధ్యాయులు పద్మ , స్రవంతి,జయలక్ష్మి ,అనురాధ ,ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు



# హన్మాజీపేటలో బాధిత కుటుంబాలను పరామర్శించిన చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ/ప్రజాదివాస్ మే 21

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో ఇటీవల మరణించిన పలువురు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. హన్మాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జంకె మల్లేశం ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు గ్రామానికి చేరుకుని, మల్లేశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా, హన్మాజీపేట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు సందేల నరేష్ తండ్రి నరసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, హన్మాజీపేట సర్పంచ్ జంకె మధు, మాజీ సర్పంచ్ జంకె విజయ శ్రీనివాస్ రెడ్డి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం పాల్గొన్నారు. అలాగే ముఖ్య నాయకులు పసుల అంజిబాబు, సామ లచ్చిరెడ్డి, మెరుపుల కార్తీక్ రెడ్డి, జంకె ప్రశాంత్ రెడ్డి, సుద్దాల శ్రీనివాస్, సందేల సత్తయ్య, పసునూరి శ్రీనివాస్, ఆడెపు రాకేష్, ఎల్లల తిరుపతి రెడ్డితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మామిడిపల్లిలో కలకలం చిన్నారులపై పిచ్చి కుక్కల దాడి...

- భయాందోళనలో గ్రామస్థులు వీడని వీధికుక్కల భయం...
- మొన్న మరణం.. నేడు చిన్నారులపై దాడి, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం...

వేములవాడ/ప్రజాదివాస్ మే 21

కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. తాజాగా గ్రామానికి చెందిన చింతం రాజేష్ (10), చింతం అజయ్ (06) అనే ఇద్దరు చిన్నారులపై పిచ్చికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో వీధికుక్కల సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. మొన్నటివరకు జరిగిన కుక్కల దాడిలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో ఒకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గ్రామస్థులు గుర్తు చేస్తున్నారు. ఆ విషాదం నుంచి ఇంకా కోలుకోకముందే, మళ్లీ చిన్నారులపై కుక్కలు దాడి చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ అధికారులు, సంబంధిత పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, వీధికుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కుక్కలను పట్టుకుని తరలించాలని లేదా వాటికి వ్యాక్సినేషన్ వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చిన్న పిల్లలు బయటకు రావాలంటేనే తల్లిదండ్రులు వణికిపోతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా మేల్కొని శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

ముస్తాబాద్ /మే 21 ప్రజా దివాస్

ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లా బాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది దేశ అభివృద్ధి, సాంకేతిక విప్లవం, యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి చిరస్మరణీయమైనవి. ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన మహానేతగా ఆయన ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని వారన్నారు కార్యక్రమంలో జిల్లా స్థాయి మండల స్థాయి గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు



# త్రాగునీటి ఎద్దడి నివారణకు మోటర్ బిగింపు

**- గ్రామ సర్పంచ్ దుర్గమ్మ**



ముస్తాబాద్/మే 21 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని 5వ వార్డులో నెలకొన్న త్రాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం కొరకు గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ పాలకవర్గం కార్యదర్శితో చర్చించి త్రాగునీటి సమస్య నివారణకు వెంటనే సింగిల్ ఫేస్ మోటర్ కొనుగోలు చేసి ఐదో వార్డులో ఉన్న బోరుకు బిగించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు బైతి నవీన్ వార్డు సభ్యులు బద్ధ రాములు, చిర్రం రమేష్, కొమ్మెట రాజు, కొమ్మెట రాజలింగయ్య, కొండం విష్ణు, జంపెల్లి తిరుపతి, మామిండ్ల కనుకవ్వ శ్రీనివాస్, గోక దివ్య స్వామి, గ్రామ కార్యదర్శి సౌజన్యతో పాటు కాలనీవాసులు శంకర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన హోమ్ గార్డ్ దేవయ్య కుటుంబానికి 30,00,000/- ఇన్సూరెన్స్ చెక్ అందజేత.




రాజన్న సిరిసిల్ల జిల్లా మే 21 ప్రజా దివాస్
జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిసిర్బిలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోమ్ గార్డ్ దేవయ్య యాక్సిస్ బ్యాంక్ లో సాలరీ అకౌంట్ ఉన్నందున యాక్సిడెంటల్ డెత్ కింద మంజూరు కాబడిన 30 లక్షల ఇన్సూరెన్స్ చెక్ యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గారి చేతుల మీదుగాదేవయ్య కుటుంబ సభ్యులకు ఈరోజు అందజేయడం జరిగింది.
ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ....విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన హోమ్ గార్డ్ దేవయ్య మరణం పోలీస్ శాఖకు తీరని లోటని,దేవయ్య కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.పోలీస్ సిబ్బంది,హోమ్ గార్డులు తమ విధులను నిర్వర్తించే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ లో నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, ఆర్.ఐ రమేష్, యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం, దేవయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వేములవాడ రూరల్ మండలంలో డ్రగ్స్ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు..

**- వేములవాడ రూరల్ మండల పరిధిలోని గ్రామాలలో కిరాణా, పాన్ షాప్స్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ.**
**- మత్తు పదార్థాల విక్రయాలు రవాణాపై కఠిన చర్యలు తప్పవు: ఎస్ఐ వెంకట్రాజం.**



వేములవాడ/ప్రజాదివాస్ మే 21
వేములవాడ రూరల్ మండలంలోని గ్రామాలలో కిరాణా, పాన్ షాప్స్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్ గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు ఉమ్మడి జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం

**- వేములవాడకు గూడూరి ప్రవీణ్, సిరిసిల్లకు తుల ఉమ**



వేములవాడ/ప్రజాదివాస్ మే 21
తెలంగాణవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలకు సభ్యత్వ నమోదు బాధ్యతలను అప్పగిస్తూ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. వేములవాడ నియోజకవర్గ డిజిటల్ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిగా గుడూరి ప్రవీణ్‌ను, సిరిసిల్ల నియోజకవర్గానికి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమను నియమించారు. అలాగే కోరుట్లకు లోక బాపు రెడ్డి, జగిత్యాలకు మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, ధర్మపురి నియోజకవర్గానికి శ్రీమతి మూల విజయ రెడ్డి, రామగుండానికి ఏనుగు రవీందర్ రెడ్డిలను బాధ్యులుగా ప్రకటించారు.మరోవైపు మంథనికి వీర్ల వెంకటేశ్వర్ రావు, పెద్దపల్లికి ఎమ్మెల్సీ పి. వెంకట్రామిరెడ్డి, కరీంనగర్‌కు కొండూరి రవీందర్ రావు, చొప్పదండికి పన్యాల భూపతి రెడ్డిలను నియమించారు. అదేవిధంగా మానకొండూర్‌కు పెరాల రవీందర్ రావు, హుజూరాబాద్‌కు డాక్టర్ చిరుమిల్ల రాకేష్, హుస్నాబాద్‌కు జివి రామకృష్ణారావును సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలుగా నియమిస్తూ కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి, ప్రతి గ్రామంలోనూ పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ సభ్యత్వ నమోదును విజయవంతం చేస్తామని ఈ సందర్భంగా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలకు బాధ్యతలు అప్పగించడం పట్ల ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఇన్‌చార్జిలకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ఉపాధి హామీ పనులు, ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలన**

తంగళ్లపల్లి, మే -21 ప్రజా దివాస్
ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఊర చెరువులో జల సంచాయ్ - జన్ భాగిదారి కింద ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా, గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి హామీ కింద ఉపాధి హామీ కల్పించాలని సూచించారు. ప్రతి రోజూ 150 మంది పనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పని చేసే చోట నీడ సదుపాయం, తాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. నిరక్షరాస్య కూలీలు ఉల్లాస్ కింద చదువు నేర్చుకోవాలని పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు సన్న వడ్లు సాగు చేయాలని పిలుపు నిచ్చారు. కొనుగోలు కేంద్రంలో తనిఖీ తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. ఇప్పటి దాకా ధాన్యం ఎంత వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? ఎంత ఏ రైస్ మిల్లుకు తరలించారో ఆరా తీశారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని సూచించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీరాజం, ఎంపీడీఓ రమేష్, ఇంచార్జి తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.



# పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడితోనే నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

**- ప్రొఫెసర్ డాక్టర్ పి మాధవి**



ముస్తాబాద్ /మే 21 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అను కార్యక్రమం ద్వారా రైతులు భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేయడం, పప్పు జాతి పంటలతో పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువుల సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా పెంచుకోవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి మాధవి, రైతులకు సూచించారు. కొండాపూర్ గ్రామం లో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ పి మాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు తోపాటు సాగు నీటి పరీక్ష ప్రతి రైతు, చేసుకోవాలని,మట్టి నమూనా ఎలా తీసుకోవాలో వివరించారు.నేలఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ,బావి తరాలకు సారవంతమైన నేలలను అందించాలని సూచించారు.రైతులకు రైతులు వరి పంటలో సన్న రకాలను సాగు చేయవచ్చని, ఆర్ఎన్ఆర్ 15048, కె ఎన్ ఎం -1638, , జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేయవచ్చు అని రైతులకు డా. ప్రీతిక సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్ర రెడ్డి, ఉపసర్పంచ్ పరుషరాములు, ఏవో అనూష, ఏఈఓ అఖిల, కళాశాల విద్యార్థులు ఆదిత్య, నిఖిల్, రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం అన్ లోడింగ్ కోసం హమాలీల సంఖ్య పెంచాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల, మే-21: ప్రజా దివాస్
ధాన్యం అన్ లోడింగ్ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, హమాలీల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంచడం, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం, తదితర అంశాలపై గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ముఖ్యంగా ఇప్పటికే లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు అపరెల్ పార్క్ కు తరలించిన వాహనాలు అన్ లోడ్ చేయడం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్ని వాహనాలు మిల్లుల వద్ద ఉన్నాయో సంబంధిత అధికారులను ఆరా తీశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వర్షాలు పడితే కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.



# ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచాలి.

**– పనిస్థలాల్లో ఉపాధి హామీ కార్మికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి**
**– జిల్లా కలెక్టర్ అంకిత్**

మే-21: ప్రజా దివాస్

లక్ష్మీదేవిపల్లి : హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఏం ఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో కార్మికులకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పని



సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా చూడాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మాస్టర్ కార్డులు పరిశీలించి ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు వస్తున్నారు, పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి కార్మికుడి హాజరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట సర్పంచ్ కంగాల అంజలి డిఆర్డిఓ విద్యాచందన, తాసిల్దార్ శిరీష, పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలం లో పలు కార్యక్రమాలు లో పాల్గొన్నా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం

మే-21: ప్రజా దివాస్

ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిరూపాలు ఇలవే ల్పులు..



దశదినకర్మల హాజరు అయి చిత్రపటానికీ పుష్పాంజలి అర్పించిన సోయం వీరభద్రం 1)దమ్మపేట (మండలం) కొమ్ముగుడెం( గ్రామం) లో లింగాలపల్లి గ్రామానికి చెంధిన చేపా వార ఇ లవేల్పులు కొమ్ముగుడెం గ్రామానికి వచ్చిన సంధర్భంగా గ్రామపెద్దలు, పూజారులు తలపతుల ఆహ్వానం మేరకు స్వామి వారినీ ధర్శిశీచుకున్న అనంతరం సోయం వీరభద్రం మట్లాడుతు ఆదివాసి సంస్కృతి మరియు సంప్రదాయాలుతో వెల్పుల పండగ జరపడం హర్షణీయం అని అన్నారు స్వామి వారి ఆశీర్వాదలు అంధరి పైన ఉండాలి అని భారస నాయకులు సోయం వీరభద్రం అన్నారు2)దమ్మపేట (మండలం) కొమ్ముగుడెం వీరన్నపాలెం (గ్రామం) లో పద్దం కోటేశ్వరరావు దశదినకర్మలకు హాజరు అయ్యి చిత్రపటానికీ పుష్పాంజలి ఘటించి నివాలులు అర్పించిన భా.ర.స నాయకులు సోయం వీరభద్రం ఈ కార్యక్రమం లో వెల్పుల తలపతులు చెపా ముక్తేశ్వరరావు,చెపా రాముడు, వాడే.నరసింహారావు ,కోర్సా వెంకటేష్,సోయం నరసింహారావు తధితరులు పాల్గొన్నారు

# నమస్తే ఇందూర్ పత్రిక ప్రత్యేక కథనం..

**–మైనర్ బాలికపై అఘాయిత్యం**
**–కామాంధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష!**
**–కామారెడ్డి ఫాస్ట్ ట్రాక్ కోర్టు సంచలన తీర్పు**
**–లక్ష రూపాయల జరిమానా**
**–ఢిల్లీ నుంచి బాలికను సురక్షితంగా రక్షించిన పోలీసులు**
**–సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆటకట్టించిన తాడ్వాయి ఖాకీలు**

మే-21: ప్రజా దివాస్

పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి కామారెడ్డి ఫాస్ట్ ట్రాక్ కోర్టు కఠిన శిక్ష విధించింది. తాడ్వాయి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ అబ్దుల్ రహీం (20)పై నేరం రుజువు కావడంతో, కామారెడ్డి జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి వరప్రసాద్ గురువారం అతనికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధిస్తూ



సంచలన తీర్పు వెలువరించారు.ఢిల్లీలో గుర్తించి రక్షించిన పోలీసులు 2022 ఆగస్టు 5న పాఠశాలకు వెళ్లిన బాలికను నిందితుడు మాయమాటలతో కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు రప్పించి, అక్కడి నుంచి ఢిల్లీకి తీసుకెళ్లాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల సహాయంతో బాలిక ఆచూకీ కనుగొని, ఢిల్లీలో ఆమెను సురక్షితంగా రక్షించారు.పక్కా సాక్ష్యాలతో బలమైన చార్జ్‌షీట్ బాధిత బాలిక వాంగ్మూలం, వైద్య పరీక్షల నివేదికలు, సాంకేతిక ఆధారాలు తదితర కీలక సాక్ష్యాలను పోలీసులు సమగ్రంగా సేకరించారు. అనంతరం నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద బలమైన చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం స్పష్టంగా రుజువు కావడంతో కోర్టు కఠిన శిక్ష విధించింది.పోలీస్ బృందానికి ఎస్పీ అభినందనలు బాధితురాలికి న్యాయం జరిగేలా కృషి చేసి, నిందితుడికి శిక్ష పడేలా సమర్థంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి డీఎస్పీ ఏ. శ్రీనివాసులు, ప్రస్తుత డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె. శేషు, సూర్యప్రసాద్, తాడ్వాయి ఎస్‌హెచ్‌వో వై. నరేష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ టి. సాయిబాబులను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించారు.మైనర్ బాలికలపై జరిగే నేరాల విషయంలో చట్టం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసిందని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

# 40° ఎండ తీవ్రత

**– ఎండ తీవ్రతపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలీ... తంబళ్ల రవి**
**– మెడికల్ క్యాంప్ లు,ఓ ఆర్ ఎస్ ,మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేయాలీ**

మే-21: ప్రజా దివాస్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం బిజెపి నాయకులు తంబళ్ల రవి మాట్లాడుతూ అశ్వరావుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల పంచాయతీ కార్యదర్శిలు వేసవి తాపం తగ్గించడం కోసం రహదారిపై నీరు కొట్టించటం, మెడికల్ క్యాంపులు,మజ్జిగ,ఓ ఆర్ ఎస్ వంటివి ప్రజలకు ఉచితంగా అందించే చర్యలు తీసుకుంటే ప్రజలకు,వాహనదారులకు,వ్యాపారులకు కొంత ఉపశమనం కలిగించినవారు అవుతారు అని,ముఖ్యంగా ఎండ తీవ్రత చిన్న పిల్లలు,పెద్ద వయసు వారి మీద ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు

# టీజీ-ఈఏపీసెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన ముక్రమ్ అహ్మద్‌కు షబ్బీర్ అలీ అభినందనలు

మే-21: ప్రజా దివాస్

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం సచివాలయంలోని తన కార్యాలయ ఛాంబర్‌లో కామారెడ్డికి చెందిన టీజీ--ఈఏపీసెట్ (వ్యవసాయ ఀ ఫార్మసీ విభాగం)లో రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి ముక్రమ్ అహ్మద్‌ను ఘనంగా అభినందించారు. టీఎంఆర్ఈఐఎస్‌కు చెందిన ముక్రమ్ అహ్మద్ 150.17 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించడం పట్ల షబ్బీర్ అలీ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ప్రతిభ, కృషి, క్రమశిక్షణకు ఇది నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత విద్యతో పాటు వృత్తి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ



అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణానికి చెందిన మైనార్టీ ఇతర విద్యార్థుల ప్రతిభను కూడా షబ్బీర్ అలీ ప్రశంసించారు.అస్మా జుబిన్ బైపిసి-2 విభాగంలో రాష్ట్ర ద్వితీయ ర్యాంకు, షారికా ముస్కాన్ బైపిసి -2లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, హురాయా దిల్సాత్ ఎంపీసీ-1లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, ఆయేషా సిద్ధిఖా బైపిసి-1లో రాష్ట్ర తృతీయ ర్యాంకు, అఫియా తబ్బుస్సుమ్ బైపిసి -1లో రాష్ట్ర నాల్గవ ర్యాంకు సాధించడం పట్ల అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ,ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో ఇదే పట్టుదలతో ముందుకు సాగి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్య ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఎంపికలో లోపాలు సరిదిద్దాలి

**కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు గండె శ్రీనివాస్, ప్రతాప్ తార తిరుమల్‌రెడ్డి**

మే-21: ప్రజా దివాస్



హుజూరాబాద్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో జరుగుతున్న లోపాలను వెంటనే సరిదిద్ది, అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కిషన్‌కు 3వ వార్డు కౌన్సిలర్ గండె శ్రీనివాస్, 4వ వార్డు కౌన్సిలర్ ప్రతాప్ తార తిరుమల్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజమైన అర్హులకు ఇళ్లు అందకుండా, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారికి లేదా ఒకే కుటుంబానికి చెందిన పలువురికి ఇండ్లు కేటాయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో పేద ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటోందన్నారు.ప్రత్యేకంగా అనాథలు, వికలాంగులు, వితంతువులు వంటి నిరుపేద వర్గాలు ఎంపిక ప్రక్రియలో పక్కనపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా మళ్లీ సమగ్ర సర్వే నిర్వహించి పారదర్శకంగా ఇండ్ల కేటాయింపులు చేపట్టాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.ప్రజల్లో ఎలాంటి అనుమానాలు తలెత్తకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి, నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# రెవెన్యూ సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహణ..

మే-21: ప్రజా దివాస్

వివిధ కేడర్‌లలో పనిచేస్తున్న రెవెన్యూ సిబ్బందికి ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 38 ప్రకారం సీనియారిటీ ఆధారంగా గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్ తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌లో నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డింగ్ అసిస్టెంట్లకు సంబంధించిన స్థానాల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగులకు పోస్టింగ్‌లు కేటాయించారు.ఈ కార్యక్రమంలో ఏ.వో. వరప్రసాద్‌తో పాటు రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి వేముల దీప్తి కి సన్మానం

మే-21: ప్రజా దివాస్




గతంలో ఆర్మూర్ కోర్ట్ లో మూడు సంవత్సరాలు జూనియర్ సివిల్ జడ్జి గా విధులు నిర్వర్తించి ఖమ్మం జిల్లా మధిర కోర్ట్ కు బదిలీ పై వెళ్లినా జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి ని ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కి గురువారం బార్ అసోసియేషన్ హాల్ లో సన్మానించారు. సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీదేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.భవ్యశ్రీ ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె గతంలో పని చేసిన అనుభవలను న్యాయ వాదులతో కలిసి పంచుకున్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు పూల బొకే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుదురుపాక ప్రవీణ్ చందర్, ఉపాధ్యక్షులు గుంజల సుదర్శన్, సెక్రటరీ పోడేటి శంకర్,ట్రెజరర్ రాజేందర్,జాయింట్ సెక్రటరీ ఎంకే నాగరాజ్,న్యాయవాదులు లోక భూపతి రెడ్డి,గంట సదానందం, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, గటడి ఆనంద్,ఎంకే నరేందర్, ఏలేటి గంగాధర్,కృష్ణ పండిత్ రూయ్యడి రాజేశ్వర్, జక్కుల శ్రీధర్,అమితాబ్ కిరాడ్, బేతు జగదీష్, షిండే,జంగా మురళిదర్, ఆవరి రమేష్,గంట విప్లవ్ కిరణ్,కొండి పవన్, గంగారాం,బాలయ్య, ఎంకే నవ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..

మే-21: ప్రజా దివాస్

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించారు. సేవా కార్యక్రమాలతో కాంగ్రెస్ నేతలు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశ యువతకు సాంకేతిక అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణానికి మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. దేశ అభివృద్ధి, సమాచార



విప్లవం, యువత సాధికారత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. నివాళుల కార్యక్రమం అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అన్నదానం చేయడంతో పాటు పాలు, పండ్లు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం జిల్లా డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐరేనీ సందీప్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప శ్రీనివాస్ ఉమారాణి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, కారంగుల అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు, అంజద్, మాజీద్, లడ్డు, బబ్లు, అన్వర్ అహ్మద్, సిద్దఖ్, కాళ్ల గణేష్, మోతిలాల్, గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, భూమని బాలరాజ్, కళ్లెం సత్యం, యూనిస్, వాజిద్, గడ్డమీది మహేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన్న రేవూరి ఇనగాల



మే-21: ప్రజా దివాస్

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గీసుగొండ మండలం కొనాయిమాకుల క్రాస్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డీసీసీ అధ్యక్షులు,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు అయ్యూబ్ అలీ మాజీ మేయర్ గుండు సుధారాణి మరియు మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా నివారించడం పై అధికారులకు ఆదేశాలు జారీ

మే-21: ప్రజా దివాస్

సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్పీ రోహిత్ రాజు మణుగూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మణుగూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో గురువారం నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా దృష్టి సారించాలని అదేవిధంగా పశువుల అక్రమ రవాణా పై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని తెలిపారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా,మట్కా,క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల



నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు నాగబాబు, అశోక్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు సురేష్ , పి.వి.ఎన్ రావు, నగేష్, రాజేష్ ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

1

# ఆత్మకూరు లో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

– మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవూర్ జలంధర్ రెడ్డి



మే-21: ప్రజా దివాస్

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవూర్ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి ఘనంగా జరిగినాయి ఆధునిక భారతానికి పునాదులు వేసిన అణగారిన బ్రతుకుల్లో వెలుగులు నింపి ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన మహానేత,భారత మాజీ ప్రధాని,భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఇవే మా ఘన నివాలు అర్పించి పేదలకు పండ్లు మరియు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినారు ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యూత్ ఊ స్పోర్ట్స్ వీక్‌లో ఉత్సాహంగా "ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే" కార్యక్రమాలు..

మే-21: ప్రజా దివాస్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ ఊ స్పోర్ట్స్ వీక్‌లో నాలుగో రోజు "ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే" కార్యక్రమాలు కామారెడ్డి జిల్లాలోని వివిధ వేదికలలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో అథ్లెటిక్స్ కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహించగా, సుమారు 200 మంది విద్యార్థులు మరియు యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. జైపాల్ రెడ్డి, కార్యదర్శి డా. కె.పి. అనిల్ కుమార్, టీజీపీటీఈఏ, పీఈటీఏటీఎస్ సభ్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, కబడ్డీ కోచ్ శ్రీనివాస్, క్రీడాకారులు యువత



పాల్గొన్నారు. అలాగే కామారెడ్డి యోగా భవన్‌లో నిర్వహించిన యోగా పోటీలలో సుమారు 80 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇదే విధంగా ఖేలో ఇండియా సెంటర్, కామారెడ్డిలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలలో సుమారు 80 మంది విద్యార్థులు యువత చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఖేలో ఇండియా కోచ్ శ్రీ సందీప్, యువజన సేవల శాఖ సిబ్బంది, క్రీడాకారులు మరియు యువత పాల్గొన్నారు. ఇంకా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న టూరిజం వీక్‌లో నాలుగో రోజు యూట్యూబర్స్ మీట్ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం గది నెం. 223లోని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ కార్యాలయంలో నిర్వహించారు. యువతలో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, ఆరోగ్య అవగాహనతో పాటు పర్యాటక ప్రాధాన్యతపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# పేరు మార్పు ప్రకటన

నేను, అకునూరి లత, భర్త: అకునూరి చిన్న, నివాసం: హౌస్ నెం. 4-42, సిర్సపల్లి గ్రామం, హుజూరాబాద్ మండలం, కరీంనగర్ జిల్లా -- 505468, తెలంగాణ రాష్ట్రం. నేను ఇంతకుముందు "అకునూరి లత" పేరుతో ప్రసిద్ధి చెంది ఉండగా, ఇకపై నా పేరు "రాముల లత"గా మార్చుకున్నాను. ఇక నుండి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, విద్యా, బ్యాంకు మరియు ఇతర అన్ని రికార్డులలో నా పేరు "రాముల లత"గా పరిగణించగలరు.

# ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగానికి నియామకాలు

– నియామక పత్రాల అందజేత

మే-21: ప్రజా దివాస్

కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో గురువారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో మహిళా విభాగానికి చెందిన పలువురు ఉద్యమకారిణులకు వివిధ హోదాల్లో నియామక పత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు బిందు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ తెలంగాణ ఆనంద్ హాజరై నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పరి శారదాను ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, దుడూరి లావణ్యను జిల్లా కార్యదర్శిగా, మెరుగు లక్ష్మిని మహిళా సలహాదారుగా, తుమ్మలపెల్లి రేణుకను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అలాగే మెరుగు రవి యాదవ్‌ను మానకొండూరు అధ్యక్షుడిగా, ఘర్షకుర్తి శంకర్‌ను ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా, ప్రణితను ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమించినట్లు బిందు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ సీమ శ్రీనివాస్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఉమ్మడి జిల్లా చైర్మన్ తెలంగాణ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు రమేష్ గౌడ్, ఉత్తర తెలంగాణ అధ్యక్షురాలు ఐల ప్రసన్న, ఉపాధ్యక్షుడు రామారావు, రాష్ట్ర సలహాదారులు రాచకొండ సత్యనారాయణరావు, బొల్లం లింగమూర్తి, వద్నాల రాజు, సత్తినేని



శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గంగిపల్లి సతీష్‌తో పాటు సహకరించిన బీసీ కుల సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజీవ్ గాంధీ సేవలు ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

మే-21: ప్రజా దివాస్

దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రాజీవ్ గాంధీ

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో టెక్స్టైల్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి

దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం గీసుగొండడ సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పరిధిలోని రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మాజీ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆయుభ్,జిల్లా కలెక్టర్ సత్య శారద తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు,దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ నిరంతరం పనిచేశారు అన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూముల కోల్పోయిన భూ నిర్వాసితులకు రుణపడి ఉంటాము అని, రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో మెరుగైన వసతులతో కూడిన ఆధునిక మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో స్టాచు, పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని టెక్స్టైల్ పార్క్ పనులను వేగవంతం చేశారన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.రాజీవ్ గాంధీ కుటుంబం త్యాలగ కుటుంబం అని, దేశ సమగ్రతకు, సమానత్వానికి పోరాటం చేశారన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన అనంతరం భూ నిర్వాసితులకు గృహ నిర్మాణం కోసం 863 మంది లబ్ధిదారులకు





ఇందిరమ్మ ఇల్లను మంజూరు చేసారన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణం, 11 కె.వి 3 ఫేజ్ 5 వైర్ ఎల్టీ లైన్స్, కొత్త ఎం ఎస్ ఎం ఈ క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి

- భారత ఐటీ విప్లవ సారథికి అశ్రు నివాళి

రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణలో పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- - కాంగ్రెస్ జిల్లా నాయకులు బత్తుల అంజి

మే-21: ప్రజా దివాస్

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలను ములకలపల్లి మండల కేంద్రంలోని రాజుపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన .?భద్రాద్రి



జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి అయిన మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు చేసిన ప్రాణత్యాగాలను దేశం ఎన్నటికీ మరువదు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరుంబుదూర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో ఆయన మరణించడం దేశానికి తీరని లోటు. కేవలం 40 ఏళ్లకే ప్రధాని అయి.. దేశంలో టెలికమ్యూనికేషన్, సాంకేతిక విద్య, కంప్యూటర్ యుగానికి రాజీవ్ గాంధీ పునాది వేశారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం, మహిళలకు 33% రిజర్వేషన్ల ఆలోచన, మరియు యువత కోసం ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. రాజీవ్ గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్, సర్పంచ్ కొర్సా చంద్రలేఖ, ఉప సర్పంచ్ పువ్వాల లలితారావు, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, మరియు వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు

# రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించిన ఎం పి కడియం కావ్య

- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

మే-21: ప్రజా దివాస్

భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎంజీఎం సర్కిల్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.గీసుగొండ మండలంలోని కోనాయిమాకుల వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.గీసుగొండ మండలం, కె.యం.టి.పీ రెసిడెన్షియల్ లేఅవుట్ గ్రామంలో 58 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి,డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ,భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో సమాచార సాంకేతిక రంగం, టెలికాం విప్లవానికి ఆయన బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన నాయకుడిగా రాజీవ్ గాంధీ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం,మహిళా సాధికారత కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని తెలిపారు.దేశ ఐక్యత, లౌకికవాద పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ కాంగ్రెస్ అయితే,మత రాజకీయాల కోసం



పనిచేసేది బీజేపీ పార్టీ అని విమర్శించారు. ప్రజల కష్టాలు తీరుస్తారని నమ్మి కేంద్రంలో బీజేపీకి అధికారం అప్పగిస్తే,యుద్ధ పరిస్థితులను బూచిగా చూపిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను పెంచి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకుడని అన్నారు.దేశ ప్రజలకు ప్రత్యామ్నాయ ఆశగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని, రానున్న రోజుల్లో ఆయన దేశ ప్రధానమంత్రి కావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 49వ డివిజన్లో పెన్షన్ అప్ గ్రేడ్ ను సద్వినియోగం చేసుకోవాలి.

- కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్ ..



మే-21: ప్రజా దివాస్

కరీంనగర్ నగరపాలక సంస్థ 49 డివిజన్ ప్రజలకు సంబదించిన పెన్షన్స్ అప్గ్రేడ్ కార్యక్రమాన్ని గురువారం రోజున స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్ మాట్లాడుతూ పెన్షన్ అప్గ్రేడ్ కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగుతుందని, డివిజన్ లో పెన్షన్ తీసుకుంటున్నారో వారందరూ తప్పకుండా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని వార్డ్ ఆఫీసర్ ,సంబధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి 12:00 వరకు పెన్షన్ అప్గ్రేడ్ చేయించుకోవచ్చని తెలిపారు. పెన్షన్ అప్ గ్రేడ్ టీం కార్పొరేటర్ కార్యాలయం, సనాతన దర్మం సేవా సమితి లో అందుబాటులో ఉంటారని తెలిపారు.. గురువారం రోజున దాదాపు గా 100 మంది వరకు పెన్షన్ లను వార్డు ఆఫీసర్ మండే శిరీష అప్డేట్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబు సుధాకర్ రెడ్డి, గాధగోని రమేష్, ఉమారాణి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ : నూతన అధ్యక్షుడిగా జువ్వాడి. శేఖర్ రావు

మే-21: ప్రజా దివాస్



తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా జువ్వాడి శేఖర్ రావుని తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ (హైదరాబాద్) ఎన్నుకున్నారు మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీ మంత్రి దివంగత నేత జువ్వాడి రత్నాకర్ రావు తనయుడు తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు సోదరులు అయినా జువ్వాడి శేఖర్ రావుకు తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా నియమింపబడడం తో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జువ్వాడి అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడు జువ్వాడి శేఖర్ రావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా నియమించిన తెలంగాణ స్టేట్ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ వారికి ప్రభుత్వానికి నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సినీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం, కమిటీ వారి సహాయ సహకారాలతో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో సినీ రంగా అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు

# జిల్లా జడ్జి ని మర్యాదపూర్వకంగా కలసిన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్

మే-21: ప్రజా దివాస్



జగిత్యాల జిల్లా ధర్మపురి కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియామకం అయినా న్యాయవాది జాజాల రమేష్ గురువారం జగిత్యాల ప్రధాన జిల్లా ఛ సెషన్స్ న్యాయమూర్తి-కమ్-జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ సి. రత్న పద్మావతి ని మర్యాదపూర్వకంగా కలిసి న్యాయవాది రమేష్ . ఈ సందర్భంగా రమేష్ కు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గా బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా జడ్జి రత్న పద్మావతి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయ సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు

# రోటరీ క్లబ్ 40 మంది బాల కార్మికులకు ఆహార పొట్లాలు పండ్లు వాటర్ బాటిల్ సమర్పించారు

మే-21: ప్రజా దివాస్

ఆధ్వర్యంలో ఈ రోజు బాలుర హై స్కూల్ ఆర్మూర్ నందు జడ్జి శ్రీదేవి మరియు సబ్ కలెక్టర్ అభినవ్,ఎమ్మార్వో సత్యనారాయణ గౌడ్, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్ మరియు లేబర్ ఆఫీసర్ సమక్షంలో 40 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించిన కార్యక్రమంలో మేము రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మా వంతు సహకారంగా బాల కార్మికులకు ఆహార పొట్లాలు, పండ్లు మరియు వాటర్ బాటిల్ అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో రోటరీ క్లబ్ అఫ్ ఆర్మూర్ సెక్రటరీ ఖాందేశ్ సత్యం, పుష్పకర్ రావు, రాస ఆనంద్, తులసి పట్వారి, ఆత్రేయ నరేష్, తదితరులు పాల్గొన్నారు.








# ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి

మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. "రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి" అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీ యాంశమైంది. కంగనా నటిస్తున్న 'భారత భాగ్య విధాత' వచ్చే నెల 12న విడుదల కానుంది.

# తారక్‌కు అభినందనల వెల్లువ



మే20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఇప్పటికే ఎన్నో రోజుల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ.. ప్రశాంత్‌నీల్ 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఫుల్ ట్రీట్ ఇచ్చారు. మరోవైపు ఎన్టీఆర్–త్రివిక్రమ్ కాంబోలో రానున్న 'గాడ్ ఆఫ్ వార్'గా ప్రచారంలో ఉన్న సినిమాకు సంబంధించి నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. త్వరలోనే షూటింగ్ సెట్‌లో కలుద్దామంటూ ఆయన విషెస్ చెప్పారు. దీంతో ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇక అభిమానులు, సెలబ్రిటీలు తారక్‌కు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకుంటున్నారు. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు. ఒక గొప్ప వారసత్వాన్ని నిలబెట్టుకోవడం అంత సులభం కాదు. కానీ మీరు దానిని ఎంతో గౌరవంతో, వినయంతో, అసాధారణమైన ప్రతిభతో ముందుకు తీసుకెళ్తున్నారు. మీ వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెప్పడానికి అదే నిదర్శనం. 'డ్రాగన్' గ్లింప్స్ అద్భుతమైన మాస్ విందులా ఉంది. మీరు ఇలాగే కోట్ల మంది హృదయాల్లో ఉంటూ బాక్సాఫీస్‌ను ఒక నిజమైన బాద్‌షాగా ఏలాలని కోరుకుంటున్నాన అంటూ శ్రీను వైట్ల పోస్ట్ చేశారు. హ్యాపీ బర్త్‌డే డియర్ తారక్. హద్దులు దాటి కీర్తిని సొంతం చేసుకున్న ఓ శక్తి ఇప్పుడు మరో గొప్ప ప్రపంచంతో మీ ముందుకు వస్తోంది. డ్రాగన్ గ్లింప్స్ అదిరిపోయింది అంటూ గోపీచంద్ మలినేని శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన వ్యక్తి. నేను అభిమానించే నా హీరో ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. లవ్ యూ కన్నా.. అంటూ నటి ఖుష్బూ విషెష్ చెప్పారు. హ్యాపీ బర్త్‌డే తారక్. నువ్వు ఆనందంగా ఉండాలని ఎన్నో మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా. డ్రాగన్ గ్లింప్స్ అద్భుతంగా ఉంది అంటూ నారా రోహిత్ ఆనందం పంచుకున్నారు. పవర్‌హౌస్, నా రావణ.. తారక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. 'డ్రాగన్' గ్లింప్స్ చాలా బాగుంది. మీ డ్యాషింగ్ లుక్ నాకు బాగా నచ్చింది. కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుందని బాబీ శుభాకాంక్షలు తెలిపారు.

## బాలకృష్ణ మూవీలో మంచు మనోజ్



'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ బడ్జెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘనవిజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

# డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్ సోషల్ మీడియాలో షేక్

దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక్ బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాక్‌డ్రాప్‌లో, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీఆర్ లుక్




మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ రఫ్ అండ్ లీన్ లుక్, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీఆర్ చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్తీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక్ బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టించిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టార్ అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరియు భువన్ గౌడ విజువల్స్ ఈ గ్లింప్స్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం 5 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా జూన్ 11, 2027న థియేటర్లలోకి రానుంది.


# దురంధర్–2పై హైకోర్టులో వ్యాజ్యం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. సశస్త్ర సీమా బల్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చుని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర




ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్ ప్రీమియర్ ఉండనుంది.

# కేన్స్‌లో మెరిసిన జాక్వెలిన్



ప్రత్యేక గీతాల్లో స్టెప్పులు... వైవిధ్యమైన పాత్రల్లో గ్లామర్‌కు నటనను జోడించి కనిపిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార జాక్వెలిన్ ఫెర్నాండెజ్. సినీ పరిశ్రమ, ఫ్యాషన్ రంగం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే కేన్స్ చిత్రోత్సవాల్లో తాజాగా సందడి చేసిందీ భామ. ఈ వేడుకలో ఇప్పటికే పలువురు భారతీయ తారలు మెరిశారు. ఇందులో భాగంగానే ఇప్పుడు కేన్స్‌లో విశిష్టమైన 'ది మిరాకిల్స్ గాలా'కు ప్రపంచ ప్రసిద్ధ తారలతోపాటు ఈ ఏడాది భారతీయ సెలబ్రిటీగా జాక్వెలిన్ హాజరైంది. సొగసైన నల్లటి మినీ డ్రెస్‌ను ధరించి వేడుకలో అడుగుపెట్టిన ఆమె రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించింది. క్లాసిక్ హాలీవుడ్ గ్లామర్ లుక్‌ని అలవోకగా ప్రదర్శిస్తూ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో జాక్వెలిన్.. "కేన్స్‌లో మిరాకిల్ షో కోసం" అనే క్యాప్షన్‌తో ఫొటోలను పంచుకుంది. జాక్వెలిన్ తదుపరి హీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'వెల్కమ్ టు ది జంగిల్' సినిమాలో కనిపించనుంది.